సాక్షి
మహబూబ్‌నగర్
బుధవారం ‌। 16 ‌। అక్టోబర్ ‌। 2024



పెళ్లిళ్ల సందడి

మంచి ముహూర్తాలు ఉండటంతో ఉమ్మడి జిల్లాలో 10వేల జంటలు ఒక్కటి కానున్నాయి.

వివరాలు 10లో ▸



హోరాహోరీగా క్రికెట్

గద్వాలలో ఎస్‌జీఎఫ్ అండర్‌– 14 క్రికెట్ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.8 /22.4

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

19న ఉమ్మడి జిల్లా కరాటే ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: **జిల్లాకేంద్రంలోని** స్టేడియంలో ఈనెల 19వ **తేదీన ఉదయం 10** గంటలకు స్కూల్ గేమ్స్ **ఫెడరేషన్ ఉమ్మడి** జిల్లాస్థాయి అండర్‌–14, అండర్‌–17 విభాగాల బాలబాలికల కరాటే ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే వారు పాఠశాల బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం జహంగీర్‌పాష ఖాద్రీ 9849301171, 9440848089 సంప్రదించాలని సూచించారు.

22న ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ కబడ్డీ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని డీఎస్‌ఏ స్టేడియంలో ఈనెల 22వ తేదీన ఉమ్మడి జిల్లా అండర్‌–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలబాలికల కబడ్డీ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఇంటర్ మీడియట్ ఒరిజినల్ బోనఫైడ్, ఎస్‌ఎస్‌సీ మెమో జిరాక్స్ కాపీతో ఉదయం 9 గంటలకు ఎంపికలకు హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం పీడీ రాజవర్ధన్‌రెడ్డి 9866811816ని సంప్రదించాలని సూచించారు.

సోనామసూరి ధర రూ.2,229

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన టెండర్లలో సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,229గా ఒకే ధర పలికింది. సీజన్ లేకపోవడం వల్ల మార్కెట్‌కు తక్కువ మొత్తంలో ధాన్యం అమ్మకానికి వచ్చింది. బుధవారం ఉదయం 10 గంటలకు మార్కెట్‌లో ఉల్లి వేలం జరుగుతుంది.

తెల్ల బంగారం మెరిసేనా!

- అధిక వర్షాలతో దిగుబడిపై ప్రభావం
- మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521
- నేటి నుంచి పత్తి కొనుగోళ్లు.. రంగంలోకి సీసీఐ



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): ఆరుగాలం కష్టపడి రైతన్నలు పండించిన పంటలకు మద్దతు ధర లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఒకయేడు అతివృష్టి, మరోయేడు అనావృష్టి, పంటలు బాగా పండితే మద్దతు ధర లేకపోవడం, దిగుబడులు లేని సమయంలో ధరలు పెరగడం.. ఇలా అనేక సమస్యలతో రైతన్నలు సతమతమవుతున్నారు. కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితుల్లో అవస్థలు పడుతున్నా రు. ఏదో రూపంలో ఇలా కర్షకులు నష్టాలను చవిచూస్తున్నారు. ప్రకృతి వైపరీత్యం, దళారుల మోసం.. వెరసీ అప్పుల పాలవుతున్నారే తప్పా గట్టెక్క లేకపోతున్నారు. గతేడాది మొదట్లో బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర క్వింటాల్‌కు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు పలికింది. ఆ తర్వాత ప్రైవేట్ వ్యాపారులు కుమ్మక్కై రూ.7,600 వరకు చెల్లించారు. ధర పెరుగుతుందని రైతులు తమ ఇళ్లలో పత్తి నిలువ ఉంచుకున్నప్పటికీ గత్యంతరం లేక చివరికి తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ ఏడాది అతివృష్టిలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆశించిన మేరకు దిగుబడి వచ్చే పరిస్థితి లేకపోగా, కనీసం పెట్టుబడి సైతం రాని పరిస్థితి. బహిరంగ మార్కెట్‌లో ధర తక్కువగా సీసీఐకే అమ్ముకోవాల్సిన పరిస్థితి. ఈనెల 16వ తేదీ (బుధవారం) నుంచి పత్తి కొనుగోళ్ల చేపట్టేందుకు ఉమ్మడి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

తేమ పేరిట తిప్పలు...

మార్కెట్ యార్డులో ఏటా తేమ కొర్రీ పేరిట రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఈసారి అధిక వర్షాలు, శీతాకాలం ప్రారంభంతో మంచు కురుస్తుండటంతో పత్తిలో తేమ శాతం పెరుగుతుంది. పత్తిలో 20 నుంచి 30 శాతం వరకు తేమ ఉండే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. అయితే సీసీఐ నిబంధనల ప్రకారం 8 నుంచి 12 తేమ శాతం ఉంటేనే కొనుగోలు చేస్తారు. ఆపై ఉంటే క్వింటాల్‌కు ఒక పాయింట్ చొప్పున ధరలో కోత విధిస్తారు. తేమ శాతం 9 ఉంటే క్వింటాల్‌కు రూ.7,445.79, తేమ 10 శాతం ఉంటే రూ.7,370.58, 11 శాతం ఉంటే రూ.7,295.37, 12 శాతం ఉంటే రూ.7,220.16 చెల్లించనున్నారు. ఇంతకుమించి తేమ ఉంటే కొనుగోలు చేయని పరిస్థితి.

ఆధార్ అథెంటిఫికేషన్ తప్పనిసరి...

ఈ ఏడాది కూడా సీసీఐ పత్తి విక్రయించే రైతులకు బయోమెట్రిక్ తప్పనిసరి చేసింది. ఆధార్ అథెంటిఫికేషన్‌తోనే కొనుగోళ్లు జరుగనుండడంతో దళారులకు చెక్ పడనుంది. రైతులు తమ పట్టా పాస్ బుక్కులకు అనుసంధానం చేసిన ఆధార్‌తో వారి ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. రైతులకు ఎన్ని ఎకరాల భూమి ఉంది, ఎంత దిగుబడి వస్తుందనే వివరాలు తెలియనున్నాయి. రైతులు మార్కెట్‌కు వచ్చి ఆధార్, ఐరిస్, ఓటీపీ ద్వారానే పత్తిని కొనుగోలు చేయనున్నారు. రైతులు అందుబాటులో లేకపోతే వారి పత్తిని కొనుగోలు చేసే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రతి రైతు పట్టా పాస్ బుక్కుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో పత్తిసాగు, అంచనా, సీసీఐ కేంద్రాలు

జిల్లా	సాగు	దిగుబడి	సీసీఐ కేంద్రాలు
మహబూబ్‌నగర్	81,277	6,79,130	2
నారాయణపేట	1,65,150	9,90,900	6
గద్వాల	1,29,000	12,91,000	1
నాగర్‌కర్నూల్	2,18,395	26,20,680	18
వనపర్తి	14,243	1,28,190	0

బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర క్వింటాల్‌కు (రూ.లలో)
6,500 - 7,000

గతేడాది సీసీఐ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన పత్తి
25,002 క్వింటాళ్లు



బాదేపల్లి మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పత్తి (ఫైల్)

పెట్టుబడి చేతికొచ్చేలా లేదు



మా గ్రామంలో సొంత పొలం ఐదెకరాలు ఉండగా, అదనంగా మరో 20 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని మొత్తం పత్తి సాగు చేశా. గతేడాది పత్తి సాగు చేయగా.. పంట దిగుబడితో పాటు మార్కెట్‌లో ధర కూడా మంచిగా పలికింది. అప్పుడు పది ఎకరాల్లో పత్తి సాగు చేస్తే పెట్టుబడి పోనూ లక్ష రూపాయల వరకు లాభం వచ్చింది. ఇప్పుడు 25 ఎకరాల్లో పత్తి సాగు చేస్తే అధిక వర్షాల వల్ల పంట పూర్తిగా దెబ్బతిన్నది. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా చేతికొచ్చే వచ్చే పరిస్థితి లేదు. వర్షం కారణంగా పత్తి కూడా రాలిపోతుంది. ధర కూడా రావడం లేదు.

– వీరేష్, రైతు, షర్టీపూర్, చిన్నచింతకుంట మండలం

ఆరబెట్టి తీసుకొస్తే మద్దతు ధర



బాదేపల్లి, మహబూబ్‌నగర్‌లలో నోటిఫైడ్ జిన్నింగ్ ఫ్యాక్టరీల్లో బుధవారం పత్తి కొనుగోళ్ల ప్రారంభిస్తున్నాం. సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే తూకం కాంటాలను సిద్ధం చేశాం. గతేడాది జిల్లావ్యాప్తంగా 25,002 క్వింటాళ్లు కొనుగోలు జరిగాయి. ఈ ఏడాది 6,79,130 క్వింటాళ్లు అంచనా వేశాం. రైతులు పత్తిని ఆరబెట్టి తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుంది. బ్యాంక్ అకౌంట్ తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేసుకోవాలి. రైతుల బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ అవుతాయి.

– బాలమణి, మార్కెటింగ్ ఏడీ, మహబూబ్‌నగర్

పత్తికి వైరస్ వచ్చింది



పత్తికి ఎర్ర రోగం వచ్చింది. రైతులకు ఎలాంటి మిగులుబాటు లేదు. పెట్టిన పెట్టుబడులు కూడా కష్టమే. మొదట కాసిన పూత, కాయ తప్ప రెండోసారి ఖాతా లేదు. వానాకాలం సీజన్‌లో జొన్న, పత్తి, కంది పంటలు కోల్పోవాల్సి వచ్చింది. రెండున్నరాల్లో పత్తి సాగు చేశా. రెండున్నర ఎకరాలకు రూ.70 వేల నుంచి రూ.80 వేల పెట్టుబడి వచ్చింది. ఎకరాకు 4 క్వింటాళ్లు దిగుబడి వచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదు. వానాకాలం పంటలు సాగు చేసిన రైతులకు నష్టాలే తప్పా లాభం అంటూ ఏమీ లేదు.

– మొగులయ్య, రైతు, పోతన్‌పల్లి గ్రామం, మహబూబ్‌నగర్ రూరల్

రూ.7,500 వస్తుందనే ఆశతోనే..



ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో మార్కెట్‌లో తక్కువ ధరకే పత్తిని అమ్ముకుంటున్నాం. సీసీఐ కేంద్రాలు ప్రారంభిస్తే క్వింటాల్‌కు రూ.7,500 వస్తుందనే ఆశతోనే నిల్వ చేసుకున్నాను. కానీ ఇంత వరకు ప్రారంభించకపోవడంతో ఎదురుచూస్తున్నాం. రెండేళ్ల నుంచి తక్కువ ధరకు పత్తిని అమ్ముకోవడం వల్ల పెట్టుబడులు రాని పరిస్థితి వచ్చింది. ఈ సారైనా సీసీఐ కేంద్రాలను ప్రారంభించి ఆదుకోవాలి.

– ఆంజనేయులు, రైతు, మరికల్, నారాయణపేట జిల్లా

కొత్త టీచర్లకు పాఠశాలల కేటాయింపు

- రాత్రి 9.30 గంటల వరకు కొనసాగిన కౌన్సెలింగ్
- 196 మందికి పోస్టింగ్ నియామక పత్రాలు
- చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి: కలెక్టర్ విజయేందిర



నియామకపత్రాలు అందుకుంటున్న కొత్త ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ–2024లో నియామకమైన కొత్త ఉపాధ్యాయులకు పాఠశాలలను కేటాయించారు. మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చే ప్రక్రియ రాత్రి 9.30గంటల వరకు కొనసాగింది. కాగా ప్రక్రియ ఉదయం 9 గంటలకే ప్రారంభమవుతుందని మొదట అధికారులు ప్రకటించినా.. సాంకేతిక సమస్యల వల్ల ప్రక్రియ మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభించారు. మొత్తం 196 మంది కొత్త ఉపాధ్యాయులకు పాఠశాలలకు కేటాయించి.. అందుకు సంబంధించి నియామక పత్రాలను అధికారులు అందించారు. ఆర్డర్లు తీసుకున్న ఉపాధ్యాయులు బుధవారం మధ్యాహ్నం లోగా విధుల్లో చేరాలని అధికారులు ఆదేశించారు. కాగా.. రాత్రి వరకు కౌన్సెలింగ్ జరగడంతో మహిళా అభ్యర్థులతో పాటు గర్భిణీలు కాస్త ఇబ్బంది పడ్డారు.

■ డీఎస్సీ ద్వారా ఉద్యోగం సంపాదించిన కొత్త ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె పలువురు ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ భవిష్యత్ ఉపాధ్యాయులపైనే ఉందని, విద్యార్థులకు మంచి బోధన అందించాలని సూచించారు. కోరుకున్న చోట పోస్టింగ్ వచ్చినా.. రాకపోయినా విధులు క్రమశిక్షణతో నిర్వహించాలని, భవిష్యత్‌లో బదిలీలలో మళ్లీ అవకాశం వస్తుందని తెలిపారు. డీఈఓ రవీందర్ మాట్లాడుతూ కలెక్టర్ చైర్మన్‌గా అదనపు కలెక్టర్, జెడ్పీసీఈఓ, డీఈఓ సభ్యులు గల కమిటీ మెరిట్ ఆధారంగా 196మంది అభ్యర్థులను పోస్టింగ్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మోహన్‌రావు, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.49 కోట్ల దుర్వినియోగం

- 33 ఎస్‌హెచ్‌జీల ఖాతాల తనిఖీ పూర్తి
- కోయనగర్ ఆర్పీపై చర్యలకు రంగం సిద్ధం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎట్టకేలకు కోయనగర్ ఏఎల్ఎఫ్ పరిధిలోని మొత్తం 33 ఎస్‌హెచ్‌జీల ఖాతాల తనిఖీ ప్రక్రియ మంగళవారంతో పూర్తయింది. ఆర్పీ శ్రీలత వివిధ సంఘాల మహిళలకు తెలియకుండానే బ్యాంకర్లతో కుమ్మక్కై ఏకంగా రూ.1.49 కోట్లు దుర్వినియోగానికి పాల్పడినట్లు ప్రాథమికంగా విచారణ బృందం అంచనా వేసింది. ఇందులో బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, పొదుపు ఖాతాలలో ఎంతెంత పక్కదారి పట్టించిందో బుధవారం వెల్లడి కానుంది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు విచారణ బృందం సమర్పించనున్నారు. దీంతో ఆర్పీ శ్రీలతపై తగు చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైంది. కాగా.. పక్కదారి పట్టించిన ఈ రుణాలతో ఆమె విలువైన ఇల్లు నిర్మించుకోవడంతో పాటు ఓ ప్లాటు కొనుగోలు చేసినట్లు సమాచారం.

రూ.కోట్లలో దుర్వినియోగమైతే ఏం చేస్తున్నారు?

'స్వయం సహాయక సంఘాలకు చెందిన రుణాలు రూ.కోట్లలో దుర్వినియోగమవుతుంటే ఏమి చేస్తున్నారు? సరిగా పనిచేయలేకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.అందరూ బాధ్యతతో మెలగాలి..' అంటూ మెప్మా అధికారులు, సిబ్బందిపై ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. నిధుల పక్కాదారిపై విచారణలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో ఎమ్మెల్యే మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డితో సమీక్షించారు. అక్కడికి మెప్మా డీఎంసీ శివకుమార్ గౌడ్, సీఓలు వరలక్ష్మి, యాదయ్య, దేవమ్మ, నిర్మల, ఆంజనేయులును పిలిపించారు. కొన్నేళ్లుగా మహిళా సంఘాలకు చెందిన రుణాలు పక్కదారి పడుతుంటే ఏమి చేస్తున్నారంటూ మందలించారు. కొందరు ఆర్పీల తీరుపై తమకు ఫిర్యాదులు అందుతున్నాయని, ఎప్పటికప్పుడు తనిఖీలు ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుతం ఆర్పీ శ్రీలత ఏకంగా రూ.కోటి పైచిలుకు దుర్వినియోగం చేయడంపై సమగ్ర నివేదిక వెంటనే ఇవ్వాలని ఆదేశించారు. ఈ వ్యవహారంలో త్వరగా బాధ్యులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.



మెప్మా కార్యాలయంలో వివరాలు సేకరిస్తున్న విచారణ బృందం

మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించాలి



జైనల్లీపూర్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ రూరల్: మహిళా శక్తి కార్యక్రమం కింద బ్యాంకులో లింకేజీ, స్త్రీ నిధి రుణం మంజూరు చేసిన వివిధ యూనిట్లు మహిళలు సక్రమంగా నిర్వహిస్తున్నారని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మంగళవారం మండలపరిధిలోని జైనల్లీపూర్‌లో మహిళా శక్తి యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. పిండి గిర్ని, బేకరి, కుట్టు మిషన్ కేంద్రాలను నిర్వహిస్తున్న మహిళలతో మాట్లాడి.. వారి వ్యాపారం, ఆదాయం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆడబిడ్డలను ఆర్థికంగా శక్తిమంతులను చేసి వారిని కోటీశ్వరులను చేయడమే మహిళా శక్తి పథకం ముఖ్య ఉద్దేశమని, ఈ పథకాన్ని జిల్లాలో దిగ్విజయంగా కొనసాగించాలని సూచించారు. స్వయం సహాయ సంఘాల ద్వారా పలు రకాల సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాలలో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం, మహిళల సామాజిక భద్రత కోణంలో సంఘాలను బలోపేతం చేయడం మహిళాశక్తి పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. సూక్ష్మ తరహా పరిశ్రమలను గుర్తించి, అందులో సంఘాలను ప్రోత్సహించడం, ఆయా సంఘాలలో మహిళలు తమ నైపుణ్యాలకు తగ్గ ఉత్పత్తులను ఎంచుకుని, ఆ ఉత్పత్తులకు అవసరమైన నైపుణ్యాన్ని అందించడం, ఆర్థిక సహకారం కోసం బ్యాంక్ లింకేజీల సదుపాయం కల్పించడం, ఉత్పత్తి అయిన సరుకులు మార్కెటింగ్‌కు అవసరమైన ప్రణాళికలు, సహకారం అందివ్వడం మహిళాశక్తి పథకంలో భాగమని తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమం ఉద్దేశం, లక్ష్యం నెరవేర్చేలా మహిళలకు అవగాహన కలిగించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ నర్సింహులు, డీపీఎం నాగమల్లిక, ఎంపీడీఓ కరుణశ్రీ, ఎంపీఓ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేగం అదుపు చేయాలి



బ్లాక్ స్పాట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ డి.జానకి, ఇతర పోలీస్ అధికారులు

- హైవేపై వేగంగా వెళుతున్న వాహనాలకు అధిక జరిమానా విధించాలి
- నిత్యం డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టాలి
- జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్స్ పరిశీలించిన ఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం/రాజాపూర్/భూత్పూర్: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్న క్రమంలో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు, జాతీయ రహదారి అథారటీ అధికారులకు ఎస్పీ డి.జానకి సూచించారు. 44వ నంబర్ జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరిగే బాలానగర్, పెద్దాయపల్లి, ముద్దిరెడ్డిపల్లి, రంగారెడ్డిగూడ, రాజాపూర్, జడ్చర్ల, భూత్పూర్, పోతులమడుగు, తాటికొండ, పోల్కంపల్లి, సంకలమద్ది, కాటారం, శాఖాపూర్, అడ్డాకుల బ్లాక్ స్పాట్లను మంగళవారం జిల్లా పోలీసులతో పాటు జాతీయ రహదారి అధికారులతో కలిసి ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గరిష్ట వేగ పరిమితిని అమలు చేయడం, అధిక వేగంతో ప్రయాణం చేసే వాహనాలను సీసీటీవీల ద్వారా గుర్తించి అధిక జరిమానాలు విధించాలన్నారు. ప్రమాదకరమైన మలుపులు, స్కూల్ జోన్, రోడ్డు పనులు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, సిగ్నల్స్ ఏర్పాటు చేయాలన్నారు. రహదారిపై అక్కడక్కడ ఉన్న గుంతలను సకాలంలో మరమ్మతులు చేయాలని, ప్రతి వాహనదారుడు సీటు బెల్టు, హెల్మెట్ ధరించే విధానంపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారిపై అక్కడక్కడ మెడికల్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రమాదం జరిగిన వెంటనే వైద్య సేవలు అందించడం, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిత్యం రోడ్డు పక్కన డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేయాలన్నారు. ఈ తనిఖీల్లో డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, సీఐలు ఆదిరెడ్డి, నాగార్జున, ఎస్‌ఐలు తిరుపాజీ, రవి, చంద్రశేఖర్, శ్రీనివాసులు, జాతీయ రహదారి భద్రత అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ఈనెల 23న మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, గతంలో అసెంబ్లీలో చెప్పిన ప్రకారం 65 ఐటీఐలను అప్‌గ్రేడ్ చేసి టాటా కన్సెల్టెన్సీ భాగస్వామ్యంతో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా మారుస్తున్నట్లు తెలిపారు. పిల్లలమర్రి రోడ్డులో ఐటీఐ కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేసి అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌గా మార్చినట్లు, అక్కడ ఆరు కోర్సులను ప్రవేశపెడుతున్నామని, డిసెంబర్ లేదా జనవరిలో ప్రారంభమవుతాయన్నారు. అక్కడ చదివిన వారికి టాటా కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చే విధంగా కోర్సులను రూపొందించినట్లు తెలిపారు. ఈనెల 23న ఈ కేంద్రంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో ఏపీజే అబ్దుల్ కలాం, రతన్‌టాటా విగ్రహాలను పెట్టడానికి సూచన ప్రాయంగా నిర్ణయించామని, కౌన్సిల్‌లో చర్చించి తీర్మానం చేస్తామని తెలిపారు.

■ పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. గుడిమల్కాపూర్, టంకర, బుద్దారం గ్రామాలకు నవాబ్‌పేట రోడ్డుకు అనుసంధానం చేస్తూ రోడ్ల నిర్మాణం చేపడుతామన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటును బీఆర్‌ఎస్ నాయకులు వ్యతిరేకిస్తుండడం సరికాదన్నారు. పార్టీని నమ్ముకున్న సీనియర్ కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు ఎస్‌పీ.వెంకటేశ్, ఎం.సురేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, ఖాజపాష, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

బాలికల ఐటీఐ కళాశాలలో అడ్మిషన్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని బాలికల ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు అడ్వాన్స్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గోపాల్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు బుధవారం నుంచి 19వ తేదీ వరకు కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని సూచించారు. మరింత సమాచారం కోసం 83742 50330, 95500 54418 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

29 వరకు దరఖాస్తు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విదేశాల్లో ఉన్నత విద్య చదివేందుకు ఆసక్తి గల వారు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ అధికారి సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యలో భాగంగా జీమ్యాట్, టోఫెల్, పీటీఈ వంటి అర్హత సాధించిన వారు మాత్రమే ఈ నెల 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల చేసుకోవాలని సూచించారు.

అద్దె చెల్లించలేదని గురుకుల పాఠశాలకు తాళం



మైనార్టీ బాలుర–2 గురుకుల పాఠశాలకు తాళం వేసిన దృశ్యం

స్టేషన్ మహబూబ్‌నగర్: అద్దె చెల్లించలేదని గురుకుల పాఠశాల భవనానికి తాళం వేసిన సంఘటన మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో చోటు చేసుకుంది. పది నెలలుగా అద్దె చెల్లించలేదని స్థానిక న్యూటౌన్‌లోని మైనార్టీ బాలుర–2 రెసిడెన్షియల్ పాఠశాలకు ఆ భవన యజమాని తాళం వేసినట్లు సమాచారం. దసరా పండుగ సెలవుల తర్వాత గురుకులానికి వచ్చిన కొంతమంది విద్యార్థులు గేటు బయట పడికాపులు కాశారు. ఈ విషయమై జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శంకరాచారి వివరణ కోరగా నాలుగు నెలల అద్దెను ప్రభుత్వం మంజూరు చేసిందని, 48 గంటల్లో యజమాని అకౌంట్‌లలో పడుతాయని తెలిపారు. తమ దృష్టికి తీసుకురాకుండా భవనానికి తాళం వేయడం సరికాదని పేర్కొన్నారు.

క్లుప్తంగా

కాల్వలో పడి రైతు మృతి

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): మండలంలోని శాయిన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు కల్మూరి వెంకటస్వామి (48) కేఎల్‌ఐ కాల్వలో పడి మంగళవారం మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం కేఎల్‌ఐ కాల్వలోని బోరు మోటారుకు ఇరుకున్న నాచును తొలగించడానికి రైతు వెంకటస్వామి కాల్వలోకి దిగాడు. నీటి ఉధృతికి కాల్వలో గల్లంతు అయ్యాడు. స్థానికులు గమనించి అధికారులకు సమాచారం అందించడంతో రెస్క్యూటీం అధికారులు గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

సైబర్ నేరగాళ్లకు జైలుశిక్ష

బల్మూర్: వర్క్ ఫ్రం హోం జాబ్ పేరుతో ఓ వ్యక్తి ఖాతా నుంచి నగదు కాజేసిన సైబర్ నేరగాళ్లకు జైలు శిక్ష విధించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గురుస్వామి వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా కాకనినగర్‌కు చెందిన జయరాం, మంగళగిరికి చెందిన కృష్ణకాంత్‌లు ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో మండలంలోని కొండనాగుల గ్రామానికి చెందిన చీమర్ల శ్రీధర్‌రెడ్డికి టెలిగ్రామ్ యాప్‌లో వర్క్ ఫ్రం హోం జాబ్ పేరుతో ఫోన్‌కు మెస్సెజ్ పంపారు. దీనిని నమ్మి శ్రీధర్‌రెడ్డి ఫోన్ చేయగా వివరాలు తెలుసుకొన్నాడు. శ్రీధర్‌రెడ్డి ఖాతా నంబర్‌కు జాయినింగ్ బోనస్‌గా సైబర్‌నేరగాళ్లు రూ.1000 లు వేసి నమ్మించారు. గ్రూపులో చేరి రూ.50 వేలు పెడితే అధికమొత్తం లాభం వస్తుందని నమ్మించారు. దీంతో రూ.38,083లను సైబర్‌నేరగాళ్లకు పంపించాడు. కొంత సమయం తర్వాత శ్రీధర్‌రెడ్డి నంబర్‌ను గ్రూపు నుంచి తొలగించడంతో అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టి నిందితులను గుర్తించారు. మంగళవారం నిందితులను అచ్చంపేట కోర్టులో హాజరుపర్చగా జడ్జి రూ.1000 జరిమానాతో పాటు మూడు నెలల జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కిడ్నాప్ కేసులో నిందితులకు రిమాండ్

కడ్తాల్: వ్యాపారిపై దాడి చేసి కిడ్నాప్‌నకు పాల్పడిన దుండగులను పోలీసులు అరెస్ట్ చేసిన రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను మంగళవారం సీఐ శివప్రసాద్ విలేకరులకు వెల్లడించారు. ఈ ఘటనకు ఇద్దరి వ్యాపారుల మధ్య లావాదేవీలే కారణంగా తేల్చారు. వనపర్తి జిల్లా పానగల్ మండలం రేమద్దుల గ్రామానికి చెందిన వ్యాపారి పిట్ల కతల్ హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 5న శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు నిమిత్తం వ్యాపారి కతల్‌తో పాటుగా ఆయన కుమారుడు శ్యామ్‌కుమార్, బావమరిదితో కలిసి వెల్దండ పీఎస్‌కు బయలుదేరారు. పని చూసుకుని తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలోని శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై కడ్తాల్ టోల్‌ప్లాజా వద్ద బద్రి అలియాస్ అన్వేష్, అఫ్రోజ్, సురేశ్, కొండల్‌లు వారి కారును ఆపి రాళ్లతో దాడి చేశారు. కతల్‌ను కారు నుంచి బయటకు ఈడ్చి విచక్షణారహితంగా దాడి చేసి దుండగులు ముందే సిద్ధం చేసుకున్న కారులో ఎక్కించుకుని కిడ్నాప్ చేశారు. ఈ కిడ్నాప్ వెనుక వావిళ్ల సంజీవ్‌కుమార్ హస్తం ఉందని కతల్ కుమారుడు శ్యామ్‌కుమార్ వెంటనే కడ్తాల్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 6న నిందితులు ఏ2 అన్వేష్ అలియాస్ బద్రి(చంద్రయాన్‌పల్లి), ఏ3 నిజాముద్దీన్(లింగారెడ్డిపల్లి), ఏ4 మహ్మద్ అఫ్రోజ్(లింగారెడ్డిపల్లి), ఏ6 సూగూరి సురేశ్(చంద్రయాన్‌పల్లి)ను రిమాండ్‌కు తరలించారు. కిడ్నాప్‌నకు వాడిన కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏ1 నిందితుడు వావిళ్ల సంజీవ్‌కుమార్(పోతేపల్లి), ఏ5 కోడెల కొండల్ (బర్కట్‌పల్లి గ్రామం)ను ఈనెల 14న రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కేసు నమోదు

గద్వాల క్రైం: కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. అయిజ మండలానికి చెందిన పరశురాముడు పథకం ప్రకారం భూ సమస్యపై వచ్చి పురుగుల మందు తాగాడు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులను అడ్డుకోవడంతో పాటు ఇబ్బందులకు గురి చేశాడు. గతంలో కూడా అతను ఈ విధంగా వ్యవహరించినట్లు అధికారులు గుర్తించారు. దీంతో గద్వాల తహసీల్దార్ శ్రీనివాస్ శర్మ మేరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీ-20 క్రికెట్ టోర్నీకి విద్యార్థిని ఎంపిక


పి. పార్వతి

వనపర్తి: గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో ఈనెల 17 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే అండర్ -23 విభాగంలో టీ-20 నేషనల్ క్రికెట్ టోర్నీకి వనపర్తి జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకులంలో ఇంటర్ చదువుతున్న పి. పార్వతి ఎంపికైంది. గతేడాది నిర్వహించిన అండర్-19విభాగంలో టీ -20, వన్డే, సీనియర్స్ టోర్నీ టోర్నమెంట్‌లలో విద్యార్థిని ప్రతిభ చాటింది. ఈ మేరకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వారు విద్యార్థినిని ఎంపిక చేసినట్లు గురుకులం ప్రిన్సిపాల్ సరస్వతి తెలిపారు. క్రీడాకారిణి పార్వతి మంగళవారం సూరత్‌కు బయల్దేరి వెళ్లినట్లు ఆమె తెలిపారు.

పెళ్లిళ్ల సందడి

12 నుంచి ప్రారంభమైన శుభముహూర్తాలు

- ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 10వేల జంటలకు వివాహాలు
- అనుబంధ రంగాలు బిజీబిజీ
- నగలు, వస్త్ర దుకాణాల్లో జోరుగా వ్యాపారం
- లక్షలాది మందికి ఉపాధి



అచ్చంపేట: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెళ్లిళ్ల సందడి మొదలైంది. శ్రావణమాసం తర్వాత ఈ నెల 12 నుంచి మూహుర్తాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే నిశ్చితార్థ తాంబూలాలు ఇచ్చిపుచ్చుకున్న కుటుంబాలు పెళ్లి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రెండున్నర నెలల పాటు మంచి ముహూ ర్తాలు ఉండటంతో భాజాభజంత్రీలు మోగనున్నాయి. దీంతో వివాహాలు, గృహ ప్రవేశాలు, పుట్టు పంచె, చీరలు, పుట్టు వెంట్రుకలు తీయడం తదితర శుభకార్యాలు నిర్వహించుకోవడానికి ముహూర్తాలు పెట్టుకునే పనిలో బిజీబిజీగా ఉన్నారు. డిసెంబరు చివరి వరకు మంచి రోజులు ఉండటంతో వివాహాల హడావుడి కనిపిస్తోంది. ఇప్పటికే కల్యాణ మండపాలన్నీ బుక్కయ్యాయి. పురోహితులు, ఫొటోగ్రాఫర్లు, కేటరింగ్, డెకరేషన్, బ్యూటీపార్లర్లు, టైలర్లు, బ్యాండ్‌మేళం నిర్వాహకులకు గిరాకీ పెరిగింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి లభించనుంది. సీజన్‌లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 10 వేలకు పైగా జంటలకు వివాహాలు జరగనున్నట్లుగా అంచనా.

ఈ తేదీల్లోనే ఎక్కువ ముహూర్తాలు..

ప్రధానంగా ఈ నెలలో 12న ప్రారంభమైన ముహూర్తాలతో పాటు నవంబరు, డిసెంబరు మాసాల్లో మంచి ఘడియలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఈ నెలలో 12, 13 తేదీలతో పాటు 16, 20, 27, నవంబరులో 3, 7, 8, 10, 13, 14, 17, 18, 20, 24 డిసెంబరులో 4, 5, 6, 7, 11, 14, 15, 20, 22, 25, 31 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి.



మండపాలు రిజర్వ్..

ఉమ్మడి జిల్లాలో చిన్న మండపాల నుంచి పెద్దపెద్ద ఫంక్షన్‌హాళ్లు 350కి పైగా ఉన్నాయి. ఇప్పటికే దాదాపు అన్ని బుక్ అయినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకు అద్దె తీసుకుంటున్నారు. ఏసీ హాళ్లకు మరి కొంత ఎక్కువ వసూలు చేస్తున్నారు. ఒకే రోజు ఉదయం పెళ్లి, సాయంత్రం రిసెప్షన్‌కు కూడా అద్దెకు ఇచ్చారు. ఫంక్షన్‌హాల్ దొరకని వారు బంక్వెట్ హాల్, అందుబాటులో ఉండే దేవాలయాలు, కమ్యూనిటీ హాల్స్, సెలవు రోజుల్లో ముహూర్తాలు ఉంటే పాఠశాలల ప్రాంగణాలను వివాహ వేదికలుగా ఎంచుకుంటున్నారు.

ఆచారాలు పాటిస్తున్నాం..



రెండున్నర మాసాల వరకు మంచి ముహుర్తాలున్నాయి. పెళ్లిళ్లతో పాటు నూతన గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాలకు అనువైన ముహూర్తాలున్నాయి. పెళ్లి వేడుకల్లో కళాత్మకత పెరిగిన ఎక్కడా రాజీ పడకుండా ఆచారాలు పాటిస్తున్నాం. శాస్త్రీయ, సంప్రదాయ పద్ధతుల్లో వివాహాలు జరిపిస్తున్నాం.

– సుభాష్‌శర్మ, పురోహితులు అచ్చంపేట

అలంకరణకు ప్రాధాన్యత



పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల్లో చాలా మంది కొత్తదనం కోరుకుంటున్నారు. ప్రధానంగా అలంకరణకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. సంప్రదాయంతో పాటు ఆకట్టుకునేలా డెకరేషన్ ఉండాలని కోరుకుంటున్నారు. హైదరాబాద్ నుంచి వివిధ రకాల పచ్చి పూలను తెచ్చి కల్యాణ వేదికలను అలంకరిస్తాం.

– జక్రియా, డెకరేషన్ ఆర్గనైజర్, అచ్చంపేట

కొనుగోళ్ల హవా..

మధ్యతరగతి వధూవరుల వస్త్రాల ఖర్చు రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు దాటుతోంది. ఇంకా బంధువులు, ఆడపడుచులు, ఇతర లాంచనాలు, సంప్రదాయాల పేరిట రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్‌తో అన్ని వస్త్రదుకాణాలు సందడిగా కనిపిస్తోంది. ఆభరణాలు కొనుగోలు ఊపందకుంది.

❒ వివాహం జీవితంలో ఒక్కసారే జరిగే భారీ వేడుక కావడంతో అట్టహాసంగా జరిపించేందుకు చాలా మంది ఆరాటపడుతున్నారు. సంపన్నుల ఇళ్లలో వివాహానికి అదనపు హంగులు, సెట్టింగ్‌లకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. పెళ్లి కూతురు అలంకరణ, మెహందీ, సంగీత్‌తో పాటు డీజే సౌండ్స్‌తో బరాత్‌కు రూ.వేలల్లో ఖర్చు పెట్టి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. విందుల్లో రకరకాల వంటకాలు, భిన్న రుచులు అందించేలా ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. మండపం అలంకరణ సినిమా సెట్టింగ్‌ను షూటింగ్‌లను తలపిస్తోంది. వేడుకలను లైవ్ ఇచ్చేందుకు ఇష్టపడుతున్నారు. హైదరాబాద్, కర్నూలు నుంచి తాజా పూలను తెప్పించి డెకరేషన్ చేస్తున్నారు.

జూనియర్ డాక్టర్ల నిరాహార దీక్ష



దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యులు

పాలమూరు: కలకత్తా ఆర్జీ కార్ మెడికల్ కళాశాలలో బాధితురాలి కుటుంబానికి సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా జనరల్ ఆస్పత్రి ఆవరణలో మంగళవారం జూనియర్ వైద్యుల సంఘం(జూడా) ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరాహార దీక్ష నిర్వహించారు. దీక్షలో జూనియర్ వైద్యులు అభిలాష్, కావ్య, అభిషేక్ కూర్చున్నారు. ఈ సందర్భంగా జూనియర్ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అభిషేక్, మాజీ అధ్యక్షుడు డాక్టర్ సాయిరాం మాట్లాడుతూ ఆర్జీకార్ ఘటనలో ఫాస్ట్ ట్రాక్ ద్వారా త్వరితగతిన సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేసు మరుగున పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనలో సరైన న్యాయం చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఈ కేసులో సరైన న్యాయం చేయాలని కోరారు. దీక్షకు ఐఎంఏతో పాటు జనరల్ ఆస్పత్రిలోని వైద్యులు డాక్టర్ సునీల్, బాలశ్రీనివాస్, వంశీ తదితరులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జూడాలు ఇషిత, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ సబ్ రిజిస్ట్రార్ బదిలీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం మంగళ వారం చేపట్టిన పలువురు సబ్ రిజిస్ట్రార్‌ల బదిలీలు, పోస్టింగుల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒకరికి స్థాన చలనం కలిగింది. నాగర్‌కర్నూల్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఎండీ అఫ్జలుద్దీన్ తాజాగా పటాన్‌చెరు జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2గా బదిలీ అయ్యారు. ఇక పటాన్‌చెరులో జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1గా పనిచేస్తున్న ఎం.రవికాంత్‌కు కొడంగల్‌లో సబ్ రిజిస్ట్రార్‌గా పోస్టింగ్ ఇస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. మంగళవారం రాత్రి 8 గంటల వరకు 60వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా.. మూడు క్రస్టు గేట్లను ఎత్తి 21,528 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం 38,155 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 71, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, సమాంతర కాల్వకు 400, భీమా లిఫ్ట్-2కు 750 క్యూసెక్కులతో కలిపి మొత్తం 61,915 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉండగా, నారాయణపూర్ ప్రాజెక్టుకు 45వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టు నుంచి 8 గేట్లను ఎత్తి 38,480 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఆల్మట్టి ప్రాజెక్టుకు 21,766 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 20వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..

దిగువ, ఎగువ జూరాల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, 268.608 ఎం.యూ., దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 247.287 ఎం.యూ. ఉత్పత్తిని చేపట్టామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 515.895 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

శ్రీశైలానికి 1,23,314 క్యూసెక్కుల వరద..

దోమలపెంట: శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వచ్చి చేరుతోంది. సుమారుగా 1,23,314 క్యూసెక్కుల వరద వస్తోంది. బుధవారం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉంది. శ్రీశైలంలో భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తికి 35,315, కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తికి 30,752 క్యూసెక్కులతో కలిపి మొత్తం 66,067 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో 16.415 ఎం.యూ. విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.015 మి.యూ. ఉత్పత్తి చేశారు.

సుంకేసులకు తగ్గిన వరద..

రాజోళి: సుంకేసుల డ్యాంకు వరద తగ్గుముఖం పట్టింది. సోమవారం 22 గేట్ల ద్వారా నీటి విడుదల చేయగా.. మంగళవారం సాయంత్రం నుంచి 15 గేట్ల ద్వారా నీటి విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఎగువ నుంచి 65,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 65,170 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామని.. 1,540 క్యూసెక్కుల నీటిని కేసీ కెనాల్‌కు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

పేద ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థిక చేయూత

- 'సాక్షి' ప్రత్యేక కథనానికి విశేష స్పందన
- భాగ్యలక్ష్మి ఉన్నత విద్యకు అండగా నిలిచిన దాతలు

సాక్షి ఎఫెక్ట్..


వైద్య విద్యార్థిని భాగ్యలక్ష్మికి రూ. 1.40 లక్షల డీడీని అందజేస్తున్న ఎస్‌సీఎస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ భారతి శ్రీవారి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని సింహగిరికి చెందిన పేద విద్యార్థిని భాగ్యలక్ష్మి ఎంబీబీఎస్‌లో మంచి ర్యాంక్ సాధించి.. సిద్దిపేట జిల్లాలోని సురభి మెడికల్ కాలేజీలో కన్వీనర్ కోటాలో సీటు సంపాదించారు. ఇప్పటి దాక బాగానే ఉన్నా.. అడ్మిషన్ ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్న భాగ్యలక్ష్మి దీన పరిస్థితిని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఈ నెల 8న 'డాక్టర్ కలకు ఆర్థిక కష్టాలు' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురించగా.. దాతల నుంచి విశేష స్పందన లభించింది. మెడికల్ కళాశాలలో అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు ఎస్‌సీఎస్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ భారతి శ్రీవారి ముందుకువచ్చారు. ఈ నెల 14న వారు స్వయంగా కాలేజీకి వెళ్లి రూ. 1.40 లక్షల ఫీజు చెల్లించి, భాగ్యలక్ష్మికి అడ్మిషన్ ఇప్పించారు. వీరితో పాటు స్ఫూర్తి ఫౌండేషన్ వారు ఆన్‌లైన్ ద్వారా కాలేజీకి మరో రూ. 1.40 లక్షల ఫీజును చెల్లించారు. అంతేకాకుండా జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా మిత్ర బృందం రూ. 15 వేలు, గద్వాల డీఆర్డీఓ నర్సింగ్‌రావు (బీఈడీ 1993–94) బ్యాచ్ మిత్రులు కలిసి రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేశారు. పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చంద్రశేఖర్ కుమారుడు వైద్య విద్యార్థి నవదీప్ రూ. 45 వేలు అందించడం పాటు ఎంబీబీఎస్ కోర్సుకు అవసరమైన పుస్తకాలతో పాటు ఇతరత్రా ఫీజులను సమకూర్చనున్నట్లు ప్రకటించారు. గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కాలేజీ విద్యార్థులు రూ. 10 వేలు, సూర్యాపేట, సిరిసిల్ల మెడికల్ కాలేజీలకు చెందిన విద్యార్థులు రూ. 45 వేలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. తన చదువుకు అండగా నిలిచిన 'సాక్షి'కి ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. తన ఎంబీబీఎస్ చదువు కోసం ఆర్థికంగా చేయూతనిచ్చిన దాతలకు హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు.

నల్లమలలో వ్యక్తి అదృశ్యం?

మన్ననూర్: నల్లమలలో వ్యక్తి తప్పిపోయినట్లు ఆనవాళ్లు దొరికిన సంఘటన శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారిలో మంగళవారం సాయంత్రం వెలుగుచూసింది. అమ్రాబాద్ ఎస్‌ఐ ఖాద్రీ కథనం ప్రకారం.. అటవీశాఖ సిబ్బంది అటవీ సరిహద్దు ప్రాంతంలో పెట్రోలింగ్‌లో నిర్వహిస్తున్న క్రమంలో మంగళవారం సాయంత్రం శ్రీశైలం ప్రధాన రహదారిలో 5వ కిలోమీటరు వద్ద రోడ్డు పక్కన చెట్లలో ఏపీ 28 డీఎస్ 2344 నంబర్‌తో ఉన్న మోటారు బైక్ పడి ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో అటవీ శాఖ వారు అమ్రాబాద్ పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న అమ్రాబాద్ పోలీసులు పరిసర ప్రాంతంలో గాలించగా హెల్మెట్, రేయిన్ కోర్టు, సెల్‌ఫోన్ లభించాయి. సెల్‌ఫోన్ ఆధారంగా నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన మేడం ఈదయ్యకు సంబంధించినవిగా నిర్ధారించుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తప్పిపోయిన సంఘటన, వ్యక్తికి సంబంధించిన ఇతర ఆధారాల కోసం పోలీసులు, ఫారెస్టు సిబ్బంది సమీప అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. అక్కడ దొరికిన వస్తువులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యాసంగి సాగుపై వీసీలో సలహాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు, అధికారులు

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): ఖరీఫ్ పూర్తి అవుతున్నందున రాబోయే యాసంగిలో సాగు చేసే పంటల సాగుపై ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతులకు, వ్యవసాయశాఖ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్‌లో సూచనలు సలహాలు ఇచ్చారు. తిమ్మాజీపేట మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ఏఓ కమల్‌కుమార్ మండల రైతులతో కలిసి సమావేశమై వీసీలో పాల్గొన్నారు. యాసంగిలో ఏఏ పంటలు సాగు చేయాలో, వాటిని తడులు, నీటి సౌకర్యంపై సూచనలు, సలహాలు చేశారు. ప్రస్తుత యాసంగిలో చీడపీడల నివారణకు ముందుగా చేయాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు సాయిరాం, నాజ్‌నీన్, శివకుమార్, హేమలత, రైతులు పాల్గొన్నారు.

గాంధీజీ స్ఫూర్తితో ముందుకు సాగుదాం


పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలటౌన్: అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్య్రం తెచ్చిన ఘనత మహాత్మా గాంధీకి మాత్రమే సాధ్యమైందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గాంధీ సంస్థల చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అండ్ గాంధీ జ్ఞాన ప్రతిష్టన్ ఆధ్వర్యంలో కన్వీనర్ విజయ కుమార్ అలంపూర్ నుంచి ఉమామహేశ్వరం వరకు చేపట్టిన బాపుబాటలో సత్యశోధన పాదయాత్ర మంగళవారం గద్వాలకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 200 మంది విద్యార్థులు గాంధీ వేషధారణలో ఆకట్టుకున్నారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం పాదయాత్రకు సంఘీభావం ప్రకటించి పాల్గొన్నారు. అనంతరం గున్న రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగాలని సూచించారు. విదేశీ సంస్కృతిని వీడనాడి, భారతీయ సంస్కృతిని పాటించాలన్నారు. సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వైద్యాన్ని అవలంబించాలని కోరారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ... గాంధీజీ ఆచరించిన విధానాలు, సిద్ధాంతాలు ప్రపంచానికి దిక్సూచిగా నిలిచాయని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్వ హనుమంతు, గాంధీ సంస్థల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజుసాగర్, ప్రధాన కార్యదర్శి హన్మిరెడ్డి, సోషల్ ఫోరం నాయకులు లక్ష్మీనారాయణ, ప్రతాప్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


గాంధీజీ వేషధారణలో చిన్నారులు

హోరాహోరీగా క్రికెట్ పోటీలు


మహబూబ్‌నగర్- వరంగల్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్


హరహన్ (50 రన్స్)


వెంకటసాయి (5 వికెట్లు)

గద్వాల టౌన్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న 68వ రాష్ట్రస్థాయి అండర్- 14 క్రికెట్ పోటీలు మంగళవారం రెండోరోజు కొనసాగాయి. ప్రతి మ్యాచ్ హోరాహోరీగా సాగింది. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరిగే క్రికెట్ మ్యాచ్‌లు మంగళవారం రెండు క్రీడా మైదానాలలో జరిగాయి. డీవైఎస్‌ఓ బీఎస్ ఆనంద్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్ టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ మ్యాచ్‌లో నిజామా బాద్ జట్టుపై జైపూర్ జట్టు విజయం సాధించింది.

■ ఖమ్మం- మెదక్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఏకపక్షంగా సాగింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఖమ్మం జట్టు ఒక వికెట్‌ను కోల్పోయి 144 పరుగులు చేసింది. భారీ విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన మెదక్ జట్టు రెండు వికెట్లను కోల్పోయి 70 పరుగులకే పరిమితమైంది. తర్వాత జరిగిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్- వరంగల్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు ఒక వికెట్ కోల్పోయి 118 పరుగులు చేసింది. హరహన్ 50 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. సాయిరాం 45 పరుగులు చేసి రాణించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన వరంగల్ జట్టు 76 పరుగులకే ఆలౌట్ అయింది. మహబూబ్‌నగర్ జట్టు క్రీడాకారుడు వెంకటసాయి 5 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. మూడో మ్యాచ్‌లో హైదరాబాద్- ఖమ్మం జట్లు తలపడగా.. ఆరు వికెట్ల తేడాతో హైదరాబాద్ జట్టు విజయం సాధించింది. తర్వాత మ్యాచ్‌లో మెదక్- మహబూబ్‌నగర్ జట్లు పోటీపడగా.. 8 వికెట్ల తేడాతో మహబూబ్‌నగర్ జట్టు గెలుపొందింది. జట్టు క్రీడాకారుడు హరహన్ హాఫ్ సెంచరీతో నాటౌట్‌గా నిలిచి జట్టును గెలిపించారు. అదిలాబాద్- నిజామాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అదిలాబాద్ జట్టు గెలుపొందింది.

■ నల్లగొండ- నిజామాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నల్లగొండ జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రంగారెడ్డి- అదిలాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు 15 పరుగుల తేడాతో గెలిచింది. నిజామాబాద్- కరీంనగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ హోరాహోరీగా సాగింది. మొదట బ్యాటింగ్ దిగిన నిజామాబాద్ జట్టు రెండు వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తర్వాత జరిగిన మ్యాచ్‌లో నల్లగొండ- రంగారెడ్డి జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో నల్లగొండ జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. కరీంనగర్- రంగారెడ్డి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన రంగారెడ్డి జట్టు 130 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ జట్టు 84 పరుగులకే కుప్పకూలింది.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

■ I, Mohammad Chotima, R/o H.No: 25-45/1, Gandhi Nagar, Wanaparthy Town and Dist, Telangana., hereby declare that my name was recorded in my Son's old Passport No: A7040962 is JUTEEMA W/o MOHAMMAD NOORUDDIN. My actual and correct name as per my passport No T8353738 is MOHAMMAD CHOTIMA W/o MOHAMMAD NOORUDDIN.

■ I, MOHAMMAD WAHED KHAN, R/o H.No: 25-45/1, Gandhi Nagar, Wanaparthy Town & Dist.Telangana, hereby state that my and my father name was recorded in my passport No: A7040962 is Pathan Wahed Khan S/o Pathan Nooruddin Khan. My and my father name actual and correct name as per aadhar card is MOHAMMAD WAHED KHAN S/o MOHAMMAD NOORUDDIN.

■ I, PATHULAVATH BETHAM S/o CHINA DEVLA, R/o H.No: 7-51, DK Thanda Village, Khila Ghanpur Mandal, Wanaparthy Dist Telangana., hereby declare that I have changed my name from BETUM CHINA DEVLA S/o CHINA DEVLA (old name) to PATHULAVATH BETHAM S/o CHINA DEVLA (new name).

WANTED

■ నూతనంగా ప్రారంభించబడిన VSR ఎంటర్‌ప్రైజెస్ నందు పనిచేయుటకు సూపర్‌వైజర్స్, ఎగ్జిక్యూటివ్ ఫీల్డ్ ఆఫీసర్స్, లేడీ టెలికాలర్స్, ITI All Trades వెంటనే కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీతం: 15,000 నుండి 25,000. ఫోన్: 88866 60569.

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంట పనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663

భవిత విద్యార్థుల కోసం

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశదంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే రేటు/క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్